క్లుప్తంగా

అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ అధ్యక్షుడిగా విప్పర్తి

కాకినాడ సిటీ: అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి నిఖిల్‌కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ స్మార్ట్ సిటీ మీటింగ్ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో 26 జిల్లాల అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్‌కృష్ణ మాట్లాడుతూ సెక్రటేరియట్ విభాగంలో 10,000 మంది సభ్యులున్నామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకోవచ్చన్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఫరూక్ జాన్, ప్రధాన కార్యదర్శిగా సల్మాన్‌భాష, వుమెన్ కార్యదర్శిగా కత్రిసీ, కోశాధికారిగా యువషణ్ముఖ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డాక్టర్ శ్రీనివాసనాయక్‌కు పురస్కారం


డాక్టర్ శ్రీనివాసనాయక్‌ను సత్కరిస్తున్న సంస్థ ప్రముఖులు

కరప: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ రామావత్ శ్రీనివాసనాయక్‌కు ఉగాది జాతీయ మహానంది పురస్కారం లభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన తెలుగు వెలుగు సాహితీ సంస్థ (స్వచ్ఛంద సేవాసంస్థ) వైద్యసేవలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ కళావేదికలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసనాయక్‌ను సత్కరించి, పురస్కారాన్ని ఆ సంస్థ ప్రముఖులు పాలోజు రాజ్‌కుమార్, దైవజ్ఞ శర్మ, గిన్నిస్‌బుక్ రికార్డ్ గ్రహీత డాక్టర్ శాంతికృష్ణశ్రీ, బ్రహ్మశ్రీ పాలోజు భాస్కరాచార్యులు, డాక్టర్ జి.రామలింగం అందజేశారు.

కింగ్‌సాల్మన్ సంగీత సేవలు చిరస్మరణీయం


కింగ్ సాల్మన్ సంతాప సభలో పాల్గొన్న సంగీత కళాకారులు

కాకినా కల్చరల్: స్వర్గీయ సీనియర్ కీబోర్డు ప్లేయర్ కింగ్ సాల్మన్ (వెంకటేష్) సంగీత సేవలు చిరస్మరణీయమని సంగీత కళాకారుడు ఎ.శివప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో కాకినాడ సంగీత కళాకారుల ఆధ్వర్యంలో కింగ్ సాల్మన్ సంతాప సభ విల్సన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సాల్మన్‌కింగ్ మరణం సంగీత రంగానికి తీరనిలోటని పలువురు వక్తలు అన్నారు. ఈయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. సంగీత కళాకారులు రామరాజు, ఎలీషా, ఎండి రాజు, తిరుమలరావు, బాజీ, శేషుకుమారి, కిషోర్, సతీష్ ప్రథమరావు పాల్గొన్నారు.

'బార్' ఎన్నికలకు ముగింపురోజు 12 నామినేషన్లు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2023–24 సంవత్సరానికి ఈ నెల 17న జరిగే బార్ ఎన్నికలకు సోమవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ముగింపు రోజున అధ్యక్ష పదవికి ముగ్గురు సీనియర్ న్యాయవాదులు ముత్తింటి విశ్వేశ్వరరావు, ఏలూరి సుబ్రహ్మణ్యం, కె.జాన్ జోసెఫ్ నామినేషన్లు దాఖలు చేశారు. జనరల్ సెక్రటరీగా వి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా అనిశెట్టి గంగాధర్ నామినేషన్లు దాఖలు చేశారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దొంతుమళ్ళ అశోక్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా కె.దయానంద్‌రాజు, మహిళా ప్రతినిధి జి.నాగ సునీత, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా ఏవీసీహెచ్‌ఎస్ సత్యనారాయణమూర్తి, సీనియర్ కమిటీ మెంబర్‌గా జి.వెంకట దుర్గాప్రసాద్, మహిళా కమిటీ మెంబర్‌గా ఎం.సరోజిని, జూనియర్ కమిటీ మెంబర్‌గా యు.ఉమాగౌరీ నామినేషన్లు దాఖలు చేశారు.

పోషణ్ పక్వాడ ముగింపోత్సవం

కాకినాడ సిటీ: కాకినాడ దుమ్ములపేటలో పోషణ్ పక్వాడ కార్యక్రమం ముగింపు సందర్భంగా పోషకాహార విలువలతో కూడిన పలు ఆహార పదార్థాలను ప్రదర్శించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సెక్టార్ సూపర్‌వైజర్ దయామణి ఆధ్వర్యంలో చిరుధాన్యాలు ప్రదర్శించి వాటి ప్రాధాన్యతను వివరించారు. వెల్‌బేబీ షో నిర్వహించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన పోషణ్ అభియాన్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ఈ కార్యక్రమంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని సూపర్‌వైజర్ దయామణి వివరించారు. చిన్నారులకు, ఆరోగ్యవంతమైన పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రసన్న, వినోదిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధిన పడకుండా అండ

- వీధి వ్యాపారులకు ప్రభుత్వం భరోసా
- వడ్డీ లేకుండా రూ.10 వేల రుణం
- నగరంలో ఇప్పటి వరకూ తొమ్మిది వేలమందికి పైగా లబ్ధి
- వలంటీర్ల ద్వారా అర్హులైన అందరికీ అందేలా చర్యలు


గాంధీనగర్‌లో రోడ్డు పక్క వీధి వ్యాపారం చేసుకొంటున్న చిరు వ్యాపారులు

బోట్‌క్లబ్: రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకొనేవారికి ప్రభుత్వం అండగా నిలిచింది. వారి వ్యాపారానికి పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీ లేకుండా రుణంగా అందిస్తోంది. ఇన్నాళ్లూ ప్రైవేటుగా అధిక వడ్డీలకు సొమ్ము తెచ్చుకొని నిత్యం వ్యాపారం చేసుకొనే వారికి వచ్చిన లాభం అంతా వడ్డీల కింద పోయేది. ప్రతీ రోజు రూ.500 సంపాదిస్తే దానిలో రూ.300 నుంచి రూ.400 వడ్డీ కింద పోయేది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీధి వ్యాపారుల కష్టం స్వయంగా పాదయాత్రలో చూసి చలించి వారికి ప్రస్తుతం వడ్డీ లేకుండా రుణం అందించారు. కాకినాడ నగరంలో తొమ్మిది వేల మంది వీధి వ్యాపారులకు ఇటీవల ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందించింది. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా వలంటీర్ల సహాయంతో వీరికి రుణాలు అందించే ఏర్పాట్లు నగర పాలక సంస్థ అధికారులు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో కొందరికే రుణాలు

టీడీపీ హయాంలో ముద్ర వంటి రుణాలు కేవలం పచ్చపార్టీ సానుభూతి పరులకు మాత్రమే జన్మభూమి కమిటీ సభ్యులు ఇచ్చేవారు. నేడు అలా కాకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ వడ్డీ లేని రుణం అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. స్థానిక వలంటీర్ల సహాయంతో వీరికి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవడం వల్ల ఎక్కడా అనర్హులకు రుణాలు అందే పరిస్థితి లేదు. దీంతో వీధి వ్యాపారస్తులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రుణం అండగా నిలిచింది



లాక్‌డౌన్ కారణంగా చాలా ఇబ్బందులు పడ్డాం. నెలల తరబడి వ్యాపారం చేసుకొనే వీలు లేకుండా పోవడంతో కుటుంబం గడవడం చాలా కష్టంగా మారింది. మళ్లీ వ్యాపారం చేసుకొనేందుకు బయట వ్యాపారస్తుల దగ్గర నుంచి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకోవాల్సిన స్థితిలో ప్రభుత్వమే అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో ఆసరాగా ఉంది.
– చాట్ల శ్రీనివాసరెడ్డి, అరటి పండ్ల వ్యాపారి

వడ్డీ భారం తగ్గింది



ప్రతీరోజు వ్యాపారం చేయాలంటే రూ.3 వేల నుంచి రూ.4 వేలు పెట్టుబడి కావాల్సి వచ్చేది. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చుకుంటే వచ్చిన మొత్తం వడ్డీల కింద సరిపోయేది. ప్రస్తుతం ప్రభుత్వ సహాయంతో వ్యాపారం చేసుకొంటున్నాను. ప్రతీ రోజు రూ.500కి పైగా సంపాదిస్తున్నా. దీంతో కుటుంబంతో సంతోషంగా ఉన్నాం.
– చల్లపల్లి తుక్కేశ్వరరావు, చిరు వ్యాపారి

సక్రమంగా సంపద తయారీ కేంద్రాల నిర్వహణ


నాడెప్ పిట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. యండమూరు పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సోమవారం సందర్శించి, దాని నిర్వహణ తీరును, అక్కడ వర్మీకంపోస్టు తయారు చేస్తున్నదీ, లేనిదీ పరిశీలించి సూచనలు చేశారు. ప్రతీరోజూ పారిశుధ్య పనులు సకాలంలో నిర్వహిస్తూ తడి, పొడి చెత్తను సేకరించి, సంపదతయారీ కేంద్రానికి తరలించాలన్నారు. వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయడం నిరంతర ప్రక్రియగా ఉండాలన్నారు. వర్మీకంపోస్టు ఎరువు తయారుచేసేందుకు అనువుగా నాడెప్ పిట్‌లు నిర్మించాలన్నారు. వర్మీకంపోస్టు ఎరువు అమ్మకాల ద్వారా పంచాయతీకి ఆదాయం చేకూరుతుందన్నారు. గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

చెత్తను రోడ్లపై వేయకండి


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: చెత్తను రోడ్ల పైన, డ్రైనేజీలలోనూ వేయొద్దని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన పదో సర్కిల్ పరిధిలోని 33వ డివిజన్ రామకృష్ణారావుపేటలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణ, తడి– పొడి చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. ప్రజలతో మాట్లాడి చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులు సక్రమంగా, సకాలంలో వస్తున్నారో లేదో ఆరా తీశారు. హూపర్ టిప్పర్ వాహనాల ద్వారా చెత్తను తరలిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్య సేవల కోసం నగరపాలక సంస్థ ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. అదే సమయంలో ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. ముఖ్యంగా చెత్తను ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సంస్థలు గాని, ప్రజలు గాని చెత్తను రోడ్లపై వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి. రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోలీస్ స్పందనకు 38 ఫిర్యాదులు


ఫిర్యాదుదారు సమస్యను పరిశీలిస్తున్న ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందనకు 38 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. వీటిలో సివిల్ వివాదాలకు సంబంధించి 8, కుటుంబ తగాదాలవి 17, ఇతర సమస్యలకు సంబంధించి 13 ఫిర్యాదులు అందాయని ఆయన అన్నారు.

కార్పొరేషన్‌లో 10 అర్జీలు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి 10 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని, అందువల్ల అయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకో వాలని కోరారు. ఆర్థికపరమైన, న్యాయపరమైన అంశాలు మినహా మిగిలిన ప్రతి సమస్యను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, వీధి దీపాలు, ఆక్రమణలు, మంచినీరు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చునని ఆయన సూచించారు. డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం


కరప హైస్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


ఇంద్రపాలెంలో టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

కాకినాడ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కాకినాడ రూరల్‌లో మొత్తం 11పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 2,515 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తొలి రోజు తెలుగు పరీక్ష రాసేందుకు పరీక్షా కేంద్రాల వద్దకు నిర్ణీత సమయం 9.30 గంటలకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. తమకు కేటాయించిన సెంటర్ల వద్ద హాల్ టిక్కెట్ నంబరు చూసుకుని పరీక్షా హాలుకు చేరుకున్నారు.

కరప మండల పరిధిలో..

కరప: వేములవాడ, వేళంగి, కరప, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 951 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 946 మంది రాసినట్టు ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి తెలిపారు. వేములవాడ హైస్కూలులో 52 మంది హాజరైనట్టు చెప్పారు. కరపలోని ఏ, బీ సెంటర్లలో 397 మందికి 395 మంది, వేళంగిలో 179 మందికి 178 మంది, పెద్దాపురప్పాడులో 117 మందికి 116 మంది, గొర్రిపూడిలో 206కి 205 మంది పరీక్ష రాశారు. కరప ఎస్ఐ నాడు రామకృష్ణ బందోబస్త్ నిర్వహించారు.

సమన్వయంతో చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్ఠ అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కాకినాడ ఆర్డీవో బీవీ రమణ ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994 అమలుపై డివిజన్ స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశంలో మాట్లాడారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన మొత్తం 101 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. 10 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో 49 డెకాయ్ ఆపరేషన్లు, 289 ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఆర్డీవో వివరించారు. డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల స్థాయిలో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఫిర్యాదుకు సంబంధించి 18004253365 టోల్‌ఫ్రీ నంబరును తప్పనిసరిగా ప్రదర్శించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బాలికల సంరక్షణకు గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని భాగస్వాములను చేయాలని ఆర్డీవో రమణ అన్నారు. డీఐవో డాక్టర్ ఐ.ప్రభాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.కృష్ణారావు, గైనికాలజిస్టు డాక్టర్ నూరున్నిసా బేగం, రేడియాలజిస్టు డాక్టర్ ఎం.కీర్తిప్రియ, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి, కాకినాడ డివిజన్ సీడీపీవోలు హాజరయ్యారు.

క్లాత్-రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బూల్‌చంద్


అసోసియేషన్ నూతన కార్యవర్గం

బాలాజీచెరువు: స్థానిక ది కాకినాడ క్లాత్ అండ్ రెడీమేడ్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బూల్‌చంద్ సదనాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ వైఎంవీఏ ఫంక్షన్ హాలులో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా గుంటూరు చేనేత వస్త్రాలయం అధినేత చిలుకోటి రామమోహన్‌రావు, కోశాధికారిగా రాధికా సిల్క్స్ అధినేత యడ్లపల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా యడ్లపల్లి రమేష్, సురేష్‌కుమార్ జైన్, జోగా సురేష్‌కుమార్, ఉపకార్యదర్శులుగా కె.సత్యానంద్, బి.సునీల్, ఉపకోశాధికారిగా ఎం.విజయ్‌ని ఎన్నుకున్నారు.

పీడియాట్రిక్స్ హెచ్‌వోడీగా డాక్టర్ మాణిక్యాంబ



కాకినాడ క్రైం: కాకినాడ చంటిపిల్లల విభాగాధిపతి(హెచ్‌వోడీ)గా డాక్టర్ దుగ్గిరాల మాణిక్యాంబను నియమిస్తూ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 2012 జనవరి 1 నుంచి 2019 జూలై మధ్య ఏడున్నరేళ్ల పాటు జీజీహెచ్‌లోనే హెచ్‌వోడీ హోదాలో పనిచేసిన డాక్టర్ మాణిక్యాంబ సాధారణ బదిలీలలో భాగంగా విశాఖపట్టణం కేజీహెచ్‌కు 2019 జూలై 12న బదిలీ అయ్యారు. అక్కడి నుంచి తిరిగి బదిలీపై గత నెల 31వ తేదీన కాకినాడకు వచ్చి ప్రొఫెసర్‌గా రిపోర్టు చేశారు. ప్రస్తుతం హెచ్‌వోడీగా కొనసాగుతున్న డాక్టర్ ఎంఎస్ రాజు స్థానంలో సీనియారిటీని అనుసరించి డాక్టర్ మాణిక్యాంబకు బాధ్యతలు కట్టబెడుతూ డాక్టర్ నరసింహం నిర్ణయం తీసుకున్నారు.

మోటారు సైకిళ్లు దగ్ధం


కాలి బూడిదైన మోటారు సైకిళ్లు

పిఠాపురం: ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న రెండు మోటారు సైకిళ్లు అగ్నికి ఆహుతైనట్టు పట్టణానికి చెందిన పిల్లి శివ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... పిఠాపురం మారెమ్మతల్లి గుడి దగ్గర చిన్నఅర్జున్‌రావుపేటలో నివాసముంటున్న పిల్లి శివ తన ఇంటి ముందు ప్రతిరోజూ రాత్రి తన అన్నదమ్ములకు చెందిన రెండు మోటారు సైకిళ్లు పార్కింగ్ చేస్తుంటాడు. ఎప్పటి లాగే ఆదివారం రాత్రి మోటారు సైకిళ్లను పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి పక్కింటి వారు లేపి మోటారు సైకిళ్లు కాలిపోతున్నట్లు చెప్పడంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు. కాగా అప్పటికే అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరో కావాలనే మోటారు సైకిళ్లను దహనం చేసినట్లు అనుమానిస్తున్నారు. దీనిపై పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కండి

కాకినాడ సిటీ: రబీ సీజన్ ధాన్యం పూర్తి స్థాయిలో సేకరించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం జేసీ చాంబర్‌లో 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం సేకరించేందుకు అవసరమైన గోనె సంచుల కొరత లేకుండా రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధం చేయాలని ఆదేశించారు. కస్టోడియన్ అధికారులను నియమించాలని, బ్యాంక్ గ్యారంటీలు సేకరించాలని, రైతు భరోసా కేంద్రాలను రైస్‌మిల్లులకు అనుసంధానం చేయాలని పౌరసరఫరాల అధికారిని జేసీ ఇలక్కియ ఆదేశించారు. రైస్ మిల్లర్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు కావల్సిన చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల మేనేజర్‌ను జేసీ ఆదేశించారు. సాంకేతిక సిబ్బందిని, డేటా ఎంట్రీ ఆపరేటర్లను, పూర్తి స్థాయిలో నియమించాలని, రైతు భరోసా కేంద్రాల వద్ద కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేయాలని, రైతులకు హమాలీలను, రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లా కోపరేటివ్ అధికారిని జేసీ ఇలక్కియ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ డి పుష్పామణి, జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాల చోరీ

కాకినాడ క్రైం: గోడౌన్‌లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు చోరీకి గురి కావడంపై కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. కాకినాడ బీచ్‌రోడ్‌లోని న్యూ పోర్టు ఏరియా బొంబాయి కాటా సమీపంలో ఉన్న అశోక్ ఇంటర్నేషనల్ గోడౌన్‌లో నిల్వ ఉంచిన తమ సంస్థకు చెందిన 224 బియ్యం బస్తాలు చోరీకి గురయ్యాయని ఎంవోఐ కమోడిటీస్ ఇండియా సంస్థ ప్రతినిధి సోమవారం రాత్రి కాకినాడ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ సుమారు 1.6 లక్షలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

విద్యార్థులకు నాట్యసిరి పురస్కారాలు


నాట్యసిరి పురస్కారాలు స్వీకరిస్తున్న నృత్యనికేతన్ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన శ్రీబాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థినులకు నాట్యసిరి పురస్కారాలు ప్రదానం చేశారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ఆఫ్రికా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాట్యోత్సవం పేరుతో కూచిపూడి, భరతనాట్యం, జానపదం నృత్య వేడుకలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. నాట్యోత్సవంలో శ్రీబాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు చేసి మెప్పించారు. వీరికి నాట్యసిరి పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. నాట్యగురువు బేతా సత్యనారాయణకు నాట్యరత్న పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారాలు నృత్యరంగంపై మరింత బాధ్యతలు పెంచాయని బేతా అన్నారు. నగర ప్రముఖులు వీరిని అభినందించారు.

ఇక హాయిగా.. వేగంగా..

- చివరి దశకు చేరిన హైవే విస్తరణ పనులు
- గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకు రహదారి విస్తరణ
- 99 శాతం పనులు పూర్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న వాహనదారులు


గోకవరం శివారున పది మీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారి


గోకవరం శివారున జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

గోకవరం: గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ ఉన్న 516–ఇ జాతీయ రహదారి పరిధిలోని గోకవరం శివారు నుంచి కోరుకొండ మండలంలోని బూరుగుపూడి గేటు వరకు సుమారు 11.2 కిలో మీటర్ల మేర రహదారి విస్తరణకు గతేడాది జనవరిలో రూ.65 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గతంలో ఉన్న ఉన్న రహదారిని పది మీటర్ల వరకు వెడల్పు చేసేందుకు గతేడాది ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు 99 శాతం పూర్తయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇక్కట్లు

గోకవరం నుంచి కోరుకొండ వరకూ గతంలో 5.5 మీటర్లు వెడల్పు గల రోడ్డు ఉండేది. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌కు నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించేవి. రహదారి ఇరుకుగా ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనికి తోడు పలు చోట్ల రహదారి పూర్తిగా ఛిద్రం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ క్రమంలో గతేడాది రూ.65 కోట్లు నిధులతో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తయ్యాయి. గోకవరం శివారున దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో ఇరుకుగా ఉన్న వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.60 లక్షలతో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ పనులు కూడా పూర్తికానున్నాయి.

షెడ్ల నిర్మాణం

ఈ మార్గంలో ప్రయాణికుల కోసం షెడ్లు సైతం నిర్మించారు. గతంలో ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడేవారమని, రహదారి విస్తరణతో ప్రయాణం సుఖవంతంగా మారిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు దాదాపు పూర్తి

గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకూ నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ మార్గంలో పలు చోట్ల ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేశాం. అక్కడక్కడా రోడ్డు సేఫ్టీ పనులు చేయాల్సి ఉంది. గోకవరం శివారున వంతెన వెడల్పునకు అనుమతి రావడంతో ప్రస్తుతం ఆ పనులు వేగంగా నిర్వహిస్తున్నాం.
– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ జేఈ, రాజమహేంద్రవరం